క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్‌లను అక్రమంగా తొలగిస్తున్నారు



కలెక్టర్ వినతిపత్రం అందచేస్తున్న ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు

ఒంగోలు అర్బన్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను ప్రస్తుత ప్రభుత్వంలో అక్రమంగా తొలగిస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకుని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ప్రకాశం భవనంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎటువంటి కారణాలు లేకుండా ఉద్యోగం నుంచి తప్పుకోవాలని గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే సగం మంది ఒత్తిళ్లు తట్టుకోలేక రాజీనామాలు చేశారని, మిగిలిన వారిపై కూడా తీవ్రమైన ఒత్తిళ్లు చేస్తున్నారని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘ అధ్యక్షుడు కొప్పోలు రామకృష్ణ, కొత్తపల్లి పుల్లయ్య, వీరబ్రహ్మయ్య, జానుబాబు, వెంకట్రావు, మల్లికార్జున, కమలహాసన్ తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మం గొప్పది

ఒంగోలు మెట్రో: సమష్టిగా ఉండి హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని విశ్వ హిందు పరిషత్ ప్రాంత మఠ మందిర్ అర్చక పురోహిత ప్రముఖ్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. దక్షిణాంధ్ర ప్రాంత మఠమందిర్ అర్చక సహ ప్రముఖ్ వ్యామజాల ప్రసన్నకుమార్, 28 మంది పురోహితులు దేవస్థానం అర్చకులు, ప్రాంత సత్సంగ్ ప్రముఖ సోమ సుబ్బారావు జిల్లా, నగర కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

ఒంగోలు సెంట్రల్: ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం పరిపాలన సౌలభ్యం దృష్ట్యా వాయిదా వేసినట్లు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. తదుపరి మీటింగ్ జరిగే రోజు, సమయం నోటీసు ద్వారా తెలియజేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

పైసా వసూల్!

- వివాదాస్పదంగా నాగులుప్పలపాడు తహసీల్దార్ వ్యవహార శైలి
- ప్రతి పనికీ రేటు కట్టి జనాలను పీడిస్తున్న వైనం
- డబ్బు కావాలంటూ సిబ్బందికి వేధింపులు



నాగులుప్పలపాడు: ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన రెవెన్యూ అధికారులు కొంతమంది సామాన్య ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. అధికార పార్టీతో అంట కాగుతూ తమ స్థాయిని మరచి చులకనైపోతున్నారు. ఇలాంటి అధికారులు గతంలో ఎంతో మంది కేసుల్లో ఇరుక్కుని.. తమ భవిష్యత్‌ను మసకబార్చుకున్నారు. అయినా మరికొంత మంది ఇదే పంథా ఎంచుకుంటూ రెవెన్యూ వ్యవస్థకు కళంకంగా మారారు.

ఎన్నికలు నిర్వహణలో భాగంగా జిల్లాలు దాటి ఇక్కడికి వచ్చిన ప్రస్తుత నాగులుప్పలపాడు తహసీల్దార్ శ్రీనివాసరావు వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. ఎన్నికలు ముగిశాయి కదా.. ఇంకా మనకు ఎదురేముంది అనుకుంటాన్నారో ఏమో తెలియదు కానీ.. తన లంచావతారాన్ని ప్రదర్శిస్తున్నాడు. ప్రస్తుతం రైతాంగ సమస్యలు, పాస్ పుస్తకాలు, విద్యార్థులకు అవసరమైన పలు ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు కార్యాలయం ముందు బారులు తీరుతుంటే ఈ అధికారి మాత్రం లంచాలకు తలుపులు బార్లా తీస్తున్నాడు. ప్రతి పనికీ ఓ రేటు తయారు చేసి వసూల్ రాజాలా మారాడు. పని కావాలంటే పైసలు సమర్పించుకో.. లేదంటే పనిమానుకో..ఇలా ఇతని వ్యవహారం మారింది.

మ్యుటేషన్ చేయాలంటే భారీ డిమాండ్

ఎలాంటి పత్రాలు లేని భూమిని మ్యుటేషన్ చేయడంలో దిట్టగా మారాడు. ఎవరు కాసులు ఎక్కువగా ఇస్తే వారి పని క్షణాల్లో చేసి పెడుతున్నాడు. అన్ని పత్రాలు సక్రమంతా ఉన్న భూమికి అయితే మ్యుటేషన్ ఆన్‌లైన్ చేయడం గోవిందా. ముఖ్యంగా అన్నదాతల నుంచి డబ్బు వసూలు చేసి సమర్పించే భారం గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులపై మోపుతున్నాడు. భారీ మొత్తంలో ఎవరు ఇస్తారు సార్.. అని ఎవరైనా ఎదురు ప్రశ్నిస్తే వారిపై కక్ష సాధింపులకు దిగుతున్నాడు. ఇటీవల తన కార్యాలయంలో ప్రభుత్వ అటెండర్ ఉన్నప్పటికీ.. ఓ గ్రామ రెవెన్యూ అసిస్టెంట్‌ను తన అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడు. ఇతని దందాకు బలి పశువులుగా మారుతోంది మాత్రం వీఆర్ఏలే. ఎన్నికలు అయిపోయిన తర్వాత తీరప్రాంతమైన కనపర్తి గ్రామంలో ఎలాంటి పత్రాలు లేని సుమారు 100 ఎకరాల వరకు మ్యుటేషన్‌లు పూర్తి చేసి లక్షల్లో సంపాదించారు. ఇలానే తనకు వసూలు చేసి పెట్టాలని లేదంటే అనేక అభియోగాలు మోపాల్సి వస్తుందని కింద స్థాయి సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నాడు. ఇలా బాహాటంగానే సిబ్బందికి మీటింగ్ పెట్టి మరీ హుకుం జారీ చేశాడు. తహసీల్దార్ బెదిరింపు వైఖరితో విసిగెత్తుతున్న వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది కుమిలిపోతున్నారు. మరో వైపు రైతులు, ప్రజలు అల్లాడిపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నాగులుప్పలపాడు తహసీల్దార్ పై ఈ మధ్య కాలంలో ఇలాంటి ఫిర్యాదులు చాలా వస్తున్నాయి. కింది స్థాయి సిబ్బందిని బెదిరిస్తున్న ఘటనలు ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నాయి. అవినీతి ఆరోపణలు ఈ మధ్య కాలంలో తరచుగా వస్తున్నాయి. ఎవరైతే నాకేంటి అనడం, ప్రతి పనికీ రేటు నిర్ణయించడం వంటి.. విషయాలు పరిశీలించి అతనిపై తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటాం.

– సుబ్బారెడ్డి, ఒంగోలు ఆర్డీఓ

ప్రతి ఒక్కరూ నాయకులే



పీటీసీ ప్రిన్సిపాల్ దామోదర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ఒంగోలు టౌన్: పీటీసీ ప్రిన్సిపాల్‌గా పని చేసిన తాను మాత్రమే నాయకుడిని కాదని, ఇక్కడ విధులు నిర్వర్తించిన ప్రతి ఒక్కరూ నాయకులేనని పీటీసీ ప్రిన్సిపాల్ ఏఆర్ దామోదర్ అన్నారు. సాధరణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా ఎస్పీగా బదిలీ అయిన ఆయనకు సిబ్బంది మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన ప్రసంగిస్తూ పోలీసు అకాడమీలో శిక్షణ తరువాత 9 నెలల పాటు ఇక్కడ ట్రైనీగా పనిచేశానని తెలిపారు. ఆ సమయంలో రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన మున్నా భాయ్ కేసును తన చొరవతోనే ఛేదించడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. అనంతరం దామోదర్ దంపతులను ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ కుమార్, డీఎస్పీలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు బాధ్యతల స్వీకరించనున్న ఎస్పీ దామోదర్

ఎస్పీగా ఏఆర్ దామోదర్ బుధవారం ఉదయం 9.30 గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈమేరకు ఎస్పీ కార్యాలయం ఒక ప్రకనలో తెలిపింది.

డ్వామా పీడీపై విజిలెన్స్ విచారణ జరపాలి

ఒంగోలు సెంట్రల్: డ్వామా పీడీ అర్జునరావు అక్రమ వేధింపులపై కేసు నమోదు చేసి విజిలెన్స్ విచారణ జరిపించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు కోరారు. ఉద్యోగులపై ఉన్నత స్థాయి అధికారి ప్రవర్తన సక్రమంగా ఉండాలని లేదంటే ఉద్యోగులు మనోవేదనకు గురవుతారని చెప్పారు. తక్షణమే జిల్లా కలెక్టర్ పీడీపై తగిన విచారణ చేయించి ఉద్యోగులకు మనో ధైర్యం కల్పించాలని కోరారు.

మూడు పోస్టులకు 58 దరఖాస్తులు

ఒంగోలు సెంట్రల్: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు ఈనెల 9న దరఖాస్తులు ఆహ్వానించారు. మంగళవారం చివరి రోజు కాగా ఆయా పోస్టులకు 58 దరఖాస్తులు వచ్చినట్లు డీఈఓ డి. సుభద్ర తెలిపారు. కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్‌కు 19 మంది, ఐఈసీఓ పోస్టుకు 11 మంది, ఏఎల్ఎస్ సీఓ పోస్టుకు 17 మంది, ఏఎస్ఓ పోస్టుకు 11 దరఖాస్తులు వచ్చాయని ఈ సందర్భంగా తెలిపారు.

ఎయిడెడ్ సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు: ఎయిడెడ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డిలు జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్ సురేఖావాణికి వినతిపత్రం అందించారు. గుర్తింపు లేని ఎయిడెడ్ పాఠశాలలను శాశ్వతంగా మూసివేయాలన్నారు.

గొర్రెల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ ఇవ్వాలి

ఒంగోలు టౌన్: గొర్రెలు, మేకలు, ఇతర పశువుల షెడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇవ్వాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి సంబంధించి 70 శాతం రాయితీ ఇస్తూ పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఎల్బీజీ భవనంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువులకు ఎక్కువ, సన్న జీవాలకు తక్కువ రాయితీ ఇవ్వాలని నిర్ణయించడం సహేతుకం కాదని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నీ రకాల షెడ్ల నిర్మాణానికి ఒకే రకంగా ఖర్చు వస్తుందని, రాయితీల విషయం మాత్రం ఈ తేడా ఎందుకని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

హార్మోన్ల అసమతుల్యతతో రుగ్మతలు

ఒంగోలు: హార్మోన్ల అసమతుల్యత వల్ల కలిగే రుగ్మతల పట్ల జాగ్రత్త వహించాలని ప్రముఖ కిమ్స్ ఎండోక్రైన్ వైద్య నిపుణులు డాక్టర్ గీతా ప్రియదర్శిని అవగాహన కలిగించారు. మంగళవారం స్థానిక క్విస్ ఫార్మసీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఎండోక్రైన్ హార్మోన్ల అసమతుల్యత.. దాని వల్ల కలిగే రుగ్మతలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి మాట్లాడారు. క్విస్ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు అధ్యక్షత వహించగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ధనమూర్తి పర్యవేక్షించారు.

ఉద్యోగుల ఆరోగ్యం సంస్థ బాధ్యత



వైద్యశిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

ఒంగోలు సెంట్రల్: విద్యుత్ సంస్థ కోసం పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడటం సంస్థ బాధ్యతని జిల్లా విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ అన్నారు. విద్యుత్ భవన్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కంటి, గుండె సంబంధిత వైద్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు. స్మార్ట్ విజన్, చైతన్య కార్డియాక్ సెంటర్ వైద్యులు నాగ మాధవి, కృష్ణ చైతన్య వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 200 మందికి పరీక్షలతో పాటు మందులు అందించారు. ఈఈలు హైమావతి, శ్రీనివాస్, కరీమ్, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



షిరిడీ క్షేత్రంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో నళినీ ప్రియా విద్యార్థులు

ఒంగోలు మెట్రో: షిర్డి సంస్థాన్ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక షిర్డీ దేవస్థానంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకాలు అలరించాయి. శ్రీ నళిని ప్రియా కూచిపూడి నృత్య నికేతన్ విద్యార్థుల సోమవారం, మంగళవారాల్లో పలు ప్రదర్శనలు ఇచ్చారు. 35 మంది విద్యార్థులు అభినయం ఆకట్టుకుంది. ఈ అవకాశం కల్పించిన షిర్డీ సంస్థాన్ వారికి ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ పుత్రిక వేదమ్మకి అభినందనలు తెలిపారు. నృత్య శిక్షకురాలు శివకుమారిని ఘనంగా సత్కరించారు.